సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు

గంజాయి రవాణా, విక్రయాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. 8లో ▸



అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం

వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ అండగా నిలిచారని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. 8లో ▸

'సాంకేతిక' చిత్రం



సాంకేతిక విద్యను అభ్యసిస్తూనే ఖాళీ సమయాల్లో ఆసక్తి ఉన్న కళలను నేర్చుకుంటూ ప్రతిభ చాటుతున్నారు నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు. ఆరు రకాల కళల్లో భళా అనిపిస్తున్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సహరి (సోమవారం వేకువజాము)
భీమవరం	6.24	4.37
తాడేపల్లిగూడెం	6.26	4.45
నరసాపురం	6.23	4.35

న్యూస్‌రీల్

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



బాలేపల్లిలో జగనన్న ఇళ్ల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: జగనన్న లేఅవుట్లకు వెళ్లే రోడ్లను యుద్ధప్రాతిపదికన నిర్మించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మండలంలోని బాలేపల్లి గ్రామంలోని రెండు లేఅవుట్లను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్లలో ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చూపుతామన్నారు. వేసవి ఇళ్ల నిర్మాణాలకు అనుకూలమని, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అందరికీ పనులు కల్పించాలన్నారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందించేలా చూడాలన్నారు. సర్పంచ్ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి గృహనిర్మాణ శాఖ పీడీ బి.పిచ్చియ్య, ఈఈ బి.వెంకటరమణ, తహసీల్దార్ బి.సుందరరాజు, ఎంపీడీఓ ఎస్.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

నిర్మాణాలు వేగిరపర్చాలి

పాలకోడేరు: గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. పాలకోడేరు జగనన్న లేఅవుట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు సూచనలు ఇచ్చారు. లేఅవుట్‌లో 235 ఇళ్లకు 18 నిర్మాణాలు మాత్రమే పూర్తికావడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణాలు వేగిరపర్చాలన్నారు. గృహ నిర్మాణాల్లో రోజూ స్టేజ్ కన్వర్షన్ జరగాలన్నారు.

వేంకటరమణా.. గోవిందా



జంటగోపురాల ప్రాంతంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు వేకువజాము నుంచి ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో పోటెత్తాయి. ఉచిత అన్నప్రసాదం కోసం నిత్యాన్నదాన భవనం వద్ద భక్తులు బారులు తీరారు. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

బెంగళూరుకు ఆర్టీసీ బస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి బెంగళూరుకు అంతర్రాష్ట్ర బస్సు సర్వీసును శనివారం స్థానిక కొత్త బస్టాండులో ప్రారంభించారు. ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ ఈ బస్సు బెంగళూరు వైపు సర్వీసు నంబర్ 4041గా, బెంగళూరు నుంచి ఏలూరుకు 4022 సర్వీసు నంబర్‌గా నడుస్తుందన్నారు. ఏలూరు నుంచి బెంగళూరుకు చార్జీ రూ.1,180గా నిర్ణయించామని, రోజూ మధ్యాహ్నం 2 గంటలకు ఇక్కడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుందన్నారు. అలాగే బెంగళూరు నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు ఏలూరు చేరుకుంటుందన్నారు.

ఆశల తరుణం

రుణమస్తు

- పంటలకు రుణ పరిమితి పెంపు
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు
- వచ్చేనెల నుంచి రుణాల మంజూరు
- సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తింపు
- వరికి ఎకరాకు రూ.5 వేల వరకు పెరిగిన పరిమితి



వరి పంట

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి 2023–24కి పంటల వారీగా రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)ని ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఆయా పంటలకు ఎంతెంత రుణం మంజూరు చేయాలనే విషయంపై జిల్లా లీడ్ బ్యాంకు వ్యవసాయ రుణాలు అందించే ఆయా బ్యాంకులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రణాళిక విడుదల చేసింది. వ్యవసాయంపై పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని ఎకరా పంటకు అయ్యే ఖర్చును లెక్కలోకి తీసుకున్నారు. రుణ పరిమితి ఎకరాకు ఎంత ఉండాలనేది రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ నిర్ధారించింది. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు ఖరీఫ్, రబీ సీజన్లకు రుణాలు మంజూరు చేయనున్నాయి. వచ్చే నెల నుంచి సెప్టెంబర్ వరకూ ఖరీఫ్ సీజన్‌గా, అక్టోబర్ నుంచి మార్చి వరకూ రబీ సీజన్‌గా పరిగణించి రుణాలను బ్యాంకులు మంజూరు చేయనున్నాయి.

పూచీలేకుండా రూ.1.60 లక్షల వరకు..

అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేసి ఎటువంటి పూచీలేకుండా రూ.1.60 లక్షల వరకూ బ్యాంకులు రుణాలు అందించేలా లీడ్ బ్యాంకు చర్యలు తీసుకుంటోంది. సకాలంలో చెల్లిస్తే రైతులకు వడ్డీ రాయితీని ప్రభుత్వం అందిస్తుంది.

అధిక వడ్డీల నుంచి రక్షణ

వ్యవసాయానికి పెట్టుబడి కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకుని ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ముందుగానే బ్యాంకుల ద్వారా రుణాలు అందించనుంది. బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయడంతో పాటు సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీని కల్పించనుంది. సాగుకు ముందే బ్యాంకు రుణాలు పొందేలా చర్యలు తీసుకుంది. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించనున్నారు.

రూ.5 వేల వరకు పెంపు

జిల్లాలో సుమారు 2.13 లక్షల ఎకరాల్లో అత్యధికంగా వరి సాగు ఉంది. వరికి సంబంధించి గత ఖరీఫ్‌లో ఎకరాకు రూ.34 వేల నుంచి రూ.38 వేల వరకూ, రబీలో రూ.38 వేల నుంచి రూ.40 వేల వరకూ రుణ సదుపాయం ఉంది. ఇదిలా ఉండగా 2023–24లో రుణపరిమితి అదనంగా రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ పెంచారు.

సకాలంలో అందించేలా..



జిల్లాలోని రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన రైతులందరికీ పంట రుణాలు సకాలంలో అందించేలా ఆయా బ్యాంకులతో సమన్వయం చేసుకుంటున్నాం. కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల రుణం బ్యాంకులు అందజేస్తాయి. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుంది. క్షేత్రస్థాయిలో రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్‌వీ రమణ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, భీమవరం

2023-24 రుణపరిమితి (ఎకరాకు రూ.లలో)

వరి (ఖరీఫ్)	38 వేల నుంచి 42 వేలు
వరి (రబీ)	42 వేల నుంచి 45 వేలు
అరటి	65 వేల నుంచి 80 వేలు
బొప్పాయి	72 వేల నుంచి 75 వేలు
మామిడి	40 వేల నుంచి 45 వేలు
నిమ్మ	22 వేల నుంచి 27 వేలు
దానిమ్మ	75 వేల నుంచి 90 వేలు
టమాటా హైబ్రీడ్	80 వేల నుంచి 90 వేలు
టమాటా ట్రెల్లీస్	65 వేల నుంచి 70 వేలు
పొగాకు	36 వేల నుంచి 40 వేలు
పండు మిరప	80 వేల నుంచి 90 వేలు
పచ్చిమిర్చి	68 వేల నుంచి 75 వేలు
పొద్దుతిరుగుడు	19 వేల నుంచి 24 వేలు
శనగలు	28 వేల నుంచి 32 వేలు
వేరుశనగ	28 వేల నుంచి 32 వేలు
పత్తి	38 వేల నుంచి 42 వేలు
కందులు	18 వేల నుంచి 22 వేలు
మొక్కజొన్న	38 వేల నుంచి 42 వేలు
జొన్నలు	19 వేల నుంచి 21 వేలు

శాశ్వత కలెక్టరేట్ ఏర్పాటుపై కృతజ్ఞతలు



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

సాక్షి, భీమవరం: ప్రజలకు మరింత చేరువలో ఉండేందుకు జిల్లా కలెక్టరేట్‌ను భీమవరం మార్కెట్‌యార్డ్‌కు శాశ్వతంగా తరలించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేయడం అభినందనీయమని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న జిల్లా ఆవిర్భావ దినోత్సవాలను భీమవరంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నామని, అదేరోజు తాడేరు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నామన్నారు. జిల్లాలోని ప్రజలందరికీ చేరువలో జిల్లా కేంద్రం ఉందని, త్వరలో మార్కెట్‌యార్డ్‌కు కలెక్టరేట్ మార్చడం మరింత వెసులుబాటుగా ఉంటుందన్నారు. ముందుగా నాయకులు, అధికారులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వీరవాసరం మండల కన్వీనర్ గూడూరి ఓంకార్, తోట భోగయ్య, నల్లం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళిక



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ మురళి

సాక్షి, భీమవరం: జిల్లాలో ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసి, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని, దీనిపై గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా కేంద్రాల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. గోనె సంచులు, హమాలీ, రవాణా ఏర్పాట్లపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను కంట్రోల్‌రూమ్ ద్వారా రోజూ పర్యవేక్షించాలన్నారు. ముందుగానే తేమమీటర్లను పరిశీలించాలని ఆదేశించారు. కిసాన్ డ్రోన్లను రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రౌండింగ్ చేయాలన్నారు.

రికార్డుల స్వచ్ఛీకరణపై..

భీమవరం (ప్రకాశంచౌక్): రెవెన్యూ రికార్డులు స్వచ్ఛీకరణ ప్రతి గ్రామంలో నూరు శాతం జరగాలని జేసీ జేవీ మురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో రికార్డుల స్వచ్ఛీకరణపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో భాగంగా వీఆర్వో, గ్రామ సర్వేయర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రెవెన్యూ రికార్డులు, దస్తావేజులు తనిఖీ చేయాలన్నారు. లోటుపాట్లు ఉంటే రైతులు, యజమానుల సమక్షంలో పరిష్కరించాలన్నారు. ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని కొన్నిచోట్ల పనులు మందకొడిగా సాగుతున్నాయని, ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా సమావేశాల్లో సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, డీఆర్వో కె.కృష్ణవేణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరావు, డీఎస్‌ఓ ఎస్.సరోజ, సివిల్ సప్లయ్ డీఎం టి.శివరామప్రసాద్, జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామరాజు, వైస్ ప్రెసిడెంట్ జయరాజు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: రాష్ట్రంలోని మహిళామణులందరినీ లక్షాధికారులను చేయడంతో పాటు మహిళా సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో శనివారం జరిగిన మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అక్కచెల్లెమ్మలందరికీ వైఎస్సార్ ఆసరా పథకాన్ని నాలుగు విడతల్లో అమలుచేస్తున్నట్లు చెప్పారు. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేసేందుకు ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో దోచుకో దాచుకో అనే రీతిలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, ఇప్పుడు ఆ అప్పులు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే తీరుస్తుందని గుర్తుచేశారు. చంద్రబాబు చేసిన అప్పులకు జమా ఖర్చులు లేవని అయితే జగన్ ప్రభుత్వంలో ప్రతి పైసా పారదర్శకంగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వెళుతున్నాయని అన్నారు. యువతకు చెందాల్సిన సొత్తును దుర్వినియోగం చేసి స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడని విమర్శించారు.

ఆర్థికంగా నిలబెట్టాలనే తపనతోనే..

మహిళల కష్టం దోపిడీ కాకూడదనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేసి మహిళాభివృద్ధి జరగాలనే తపనతో జగన్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం మంత్రి కారుమూరి తణుకు మున్సిపాలిటీ పరిధిలోని 819 డ్వాక్రా సంఘాల్లోని 7,821 మంది మహిళలకు రూ.5.71 కోట్ల చెక్కును అందించారు. డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఇందుగపల్లి బలరామకృష్ణ, పి.అంజిబాబు, పెన్మెత్స రామరాజు, ఉండవల్లి జానకి, నత్తా కృష్ణవేణి, మున్సిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, సచివాలయ సెక్రటరీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కనులు లేవని కలత చెందక..

సండే స్పెషల్



ల్యాప్‌టాప్ ద్వారా బోధిస్తూ..

- బహుముఖ ప్రజ్ఞాశాలిగా అంధ ఉపాధ్యాయుడు
- సాంకేతిక పరిజ్ఞానంతో పాఠాలు
- పాటల రూపంలో ఆకట్టుకుంటున్న బోధన
- పలువురికి ఆదర్శం

కైకలూరు: కారు చీకట్లు కమ్ముకున్న జీవనయానంలో వెలుగుదారులు వెతికారు.. అలముకున్న అంధకారాన్ని పారద్రోలి విజ్ఞాన జ్యోతులు వెలిగించారు.. కనులు లేవని కలత చెందక బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్నారు కైకలూరు నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు గాజుల సురేష్. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన జీవనయానాన్ని ఒకసారి పరికిస్తే.. 'పిల్లలూ.. తెలుగు పుస్తకంలో తొమ్మిదో పేజీలోని మూడో లైన్ చెప్పండి..' అని సురేష్ మాస్టార్ అడగ్గానే విద్యార్థి కృష్ణ టక్కున లేచి చెప్పాడు. 'ఆగాగు.. మధ్యలో ఓ పదం చెప్పలేదేంటీ?' అని మాస్టారు అడిగారు. అది విన్న ఆ విద్యార్థి ఆశ్చర్యపోయాడు. ఇలాంటి చిన్నపాటి పొరపాట్లను కూడా క్షుణ్ణంగా గుర్తిస్తూ ఉత్తమ బోధన చేస్తున్నారు సురేష్. కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం కోరుకొల్లుకు చెందిన గాజుల సురేష్‌కు పుట్టుకతోనే అంధత్వం. పైగా చిన్నతనంలోనే తండ్రి రాజారావు మృతిచెందారు. ముగ్గురు పిల్లల్లో చిన్నవాడైన సురేష్‌ను తల్లి కృష్ణకుమారి చదివించి ప్రయోజకుడిని చేశారు.



కైకలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు సురేష్

విద్యాభ్యాసం ఇలా...

సురేష్ 1 నుంచి 10వ తరగతి వరకు నరసాపురం ఆంధ్రా అంధుల మోడల్ హైస్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్ ఆలియా జూనియర్ కాలేజీలో, బీఏ నిజాం కళాశాలలో పూర్తిచేశారు. 2009–10 బ్యాచ్‌లో హైదరాబాద్ శ్రీ స్వామినారాయణ గురుకుల కాలేజీలో బీఎడ్, ఎంఏ పాలిటిక్స్, ఎంఏ తెలుగు ఆంధ్రా యూనివర్సిటీలో చదివారు. కంప్యూటర్ కోర్సు డీసీఏ పూర్తి చేశారు. 2012 డీఎస్సీలో గ్రేడ్–2 తెలుగు ఉపాధ్యాయుడిగా కైకలూరులో విధులు చేపట్టారు. అదే ఏడాది హైదరాబాద్‌లో తనతో పాటు చదివిన అంధ విద్యార్థిని నితిపూడి సుజాతను వివాహం చేసుకున్నారు. ఆమె తాటిపాక హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కలెక్టర్ కావాలని నా కల

కలెక్టర్ కావాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాను. తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేయడం సంతృప్తిగా ఉంది. ఇటీవల గ్రూప్స్ పరీక్షలు రాశాను. అవయవలోపం అనేది శరీరానికే కాని మనసుకు కాదు. ప్రత్యేకావసరాలు కలిగిన వ్యక్తులు కుంగిపోవద్దు. అందరితో సమానంగా అన్ని రంగాల్లో మనం ముందుంటున్నాం.

– గాజుల సురేష్, తెలుగు ఉపాధ్యాయుడు, కైకలూరు

బహుముఖ ప్రజ్ఞాశాలిగా..

సురేష్ పలు రంగాల్లో ప్రతిభ చూపుతున్నారు. భార్య సుజాతతో కలిసి 'విలువైన జీవితం' అనే పుస్తకాన్ని రచించారు. పలు పాటల పుస్తకాలను ముద్రించారు. ఫ్లూట్, కీబోర్డు వాయిస్తారు. ల్యాప్‌టాప్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు. పాటల రూపంలో పాఠాలను అర్థమయ్యే రీతిలో బోధించే పద్ధతులు విద్యార్థులకు ఆసక్తి కలిగిస్తున్నాయి. పుస్తకాలను బ్రెయిలీ లిపిలో గుర్తిస్తూ విద్యార్థులకు బోధిస్తున్నారు. ట్రాక్ బ్యాక్, నాన్ విజువల్ డెస్క్ ఎక్సాస్ (ఎన్‌వీడీఏ), జాస్ ఎక్సాస్ విత్ స్పీచ్ (జాస్) సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి సెల్, ల్యాప్‌టాప్‌లను సురేష్ అలవోకగా వినియోగిస్తున్నారు.

క్లుప్తంగా

గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు



మండవల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

మండవల్లి: గంజాయి రవాణా, విక్రయాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 సంవత్సరం కంటే 2022 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించి ట్రాఫిక్ నియంత్రణ చేసినట్లు పేర్కొన్నారు. భార్యాభర్తల కేసులను పరిశీలించి రాజీ పడేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్పందన కార్యక్రమం సమగ్రవంతంగా నిర్వహించి మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని కేసులు జిల్లా స్థాయిలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్సై టి.రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ రాష్ట్ర కన్వీనర్‌గా చంద్రిక



చంద్రికకు నియామకపత్రం ఇస్తున్న రాజు

ఏలూరు (టూటౌన్): ఏపీ ట్రాన్స్‌జెండర్స్ రాష్ట్ర కన్వీనర్‌గా సరిపల్లి చంద్రికను నియమించినట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు చెప్పారు. తంగెళ్లమూడిలోని కమ్యూనిటీ హాలులో పీవీ రావు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యోనా రాజు మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 43,769 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా అందులో ఎస్సీలు 6,226, ఎస్టీలు 3,225 మంది ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలోని వేలమంది ట్రాన్స్‌జెండర్స్‌కు రేషన్‌కార్డు, చేయూత వంటి పథకాలు అందిస్తూ ఆదుకుంటున్నారన్నారు. చంద్రిక మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లు వివక్షకు గురవుతున్నారన్నారు. నాయకులు సత్తెనపల్లి కిషోర్, పులవర్తి డేవిడ్, గెద్దం సుజాత, పి.సంతోష్, పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

సాంకేతిక చిత్రం.. అభిరుచి సజీవం

- చిత్రకళలో రాణిస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు
- ఆర్ట్‌సోల్ ఎగ్జిబిషన్‌లో అబ్బురపరుస్తున్న చిత్రాలు
- నూజివీడు కళాశాలలో ఆరు రకాల ఆర్ట్‌లలో శిక్షణ



ఆర్ట్‌సోల్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చిత్రాలను తిలకిస్తున్న విద్యార్థినులు





నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాల ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన విద్యార్థులు గీచిన చిత్రాలు

నూజివీడు: ఒకవైపు సాంకేతిక విద్యను అభ్యసిస్తూనే మరోవైపు ఖాళీ సమయాల్లో తమకు ఆసక్తి ఉన్న కళలను నేర్చుకుంటూ వాటిలోనూ తమ ప్రతిభను చాటుతున్నారు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు. పెన్సిల్ ఆర్ట్, వర్లీ ఆర్ట్స్, పెయింటింగ్ ఆర్ట్స్, కలర్ పెన్సిల్ ఆర్ట్, వాటర్ కలర్ ఆర్ట్, పోస్టర్ కలర్ ఆర్ట్, మండల ఆర్ట్‌లలో వారు గీచిన చిత్రాలు పేరుగాంచిన చిత్రకారుల చిత్రాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి. సృజనాత్మకత ఉట్టిపడేలా ఉన్న ఈ చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రాలను చూసి చాన్సలర్ నుంచి వైస్ చాన్సలర్, డైరెక్టర్, అధ్యాపకుల వరకు ఆశ్చర్యపోయారంటే ఎలా ఉన్నాయో చెప్పవచ్చు.

ఇంజినీరింగ్ విద్యను నేర్చుకుంటూనే..

నూజివీడు ట్రిపుల్‌ఐటీ ఆవరణలో నిర్వహిస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పెన్సిల్ ఆర్ట్, కలర్ పెన్సిల్ ఆర్ట్, పోస్టర్ ఆర్ట్, పెయింటింగ్ ఆర్ట్, వాటర్ కలర్ ఆర్ట్, వర్లీ ఆర్ట్‌లలో రాణిస్తున్నారు. ఒకవైపు ఇంజినీరింగ్ విద్యను చదువుకుంటూనే ఖాళీ సమయంలోనే వీటిని నేర్చుకుంటున్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ‘ఆర్ట్‌సోల్’ పేరుతో ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో ఉంచిన విద్యార్థులు గీచిన చిత్రాలను చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యచకితులవుతున్నారు. ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను చూసి ఔరా అని అనకుండా ఉండలేకపోతున్నారు. 28 మంది విద్యార్థులు గీచిన చిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. కొంతమంది విద్యార్థులైతే మూడు రకాల చిత్రాలనూ గీయడం విశేషం. అన్నీ కూడా వాటికవే పోటీపడుతూ తిలకించేవారి చూపులను తిప్పుకోనివ్వకుండా చేస్తున్నాయి.

చదువుతో పాటు ఇతర కళలకూ ప్రాధాన్యం

ట్రిపుల్ ఐటీలో చదువుతో పాటు ఇతర కళలకు ప్రాధాన్యతనిస్తారు. ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసే సరికి సంగీతం, నృత్యం, ఆర్ట్, యోగా వంటి వాటిని విద్యార్థులకు నేర్పుతారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న వాటిల్లో చేరవచ్చు. చదువు పూర్తయ్యే సమయానికి వీటిని కూడా పూర్తి స్థాయిలో నేర్చుకోవచ్చు. ఆ తరువాత వారికి నచ్చిన రంగంలో స్థిరపడవచ్చు.

శ్రీకాకుళం విద్యార్థుల్లోనే ఎక్కువ ఆసక్తి

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి సంబంధించి శ్రీకాకుళం క్యాంపస్లో ఇంజినీరింగ్ విద్యార్థులకు ల్యాబ్ వసతులు లేకపోవడంతో ఇంజినీరింగ్ మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు నూజివీడు ట్రిబుల్ ఐటీ క్యాంపస్‌లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇక్కడ శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు సైతం అక్కడి వారే. నూజివీడు విద్యార్థులకు, శ్రీకాకుళం విద్యార్థులకు వేర్వేరు అంశాల్లో శిక్షణ ఇస్తుండగా, శ్రీకాకుళం విద్యార్థులే ఎక్కువగా చిత్రకళను నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తుండటం గమనార్హం.

భవిష్యత్‌లో చాలా ఉపయోగం



ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూట ఆరు రకాల ఆర్ట్‌లపై శిక్షణనిస్తున్నారు. దీని వల్ల ఏకాగ్రత పెరుగుతోంది. చదువుతో పాటు చిత్రాలను గీయడం నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది. ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న మాకు డ్రాయింగ్‌పై చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉండేది.

– దేవి నేమాల, జ్యోత్స్న నెల్లి

పీయూసీ నుంచి ఆసక్తి



తనకు పీయూసీ ప్రథమ సంవత్సరం నుంచి ఆర్ట్‌లు నేర్చుకోవాలని ఆసక్తి కలిగింది. ప్రతిరోజూ ఖాళీ సమయంలో వెళ్లి మండల ఆర్ట్‌ను నేర్చుకుంటున్నా. దీనిని జీవితంలో ప్రవృత్తిగా మార్చుకుంటా. ఏకాగ్రతకు ఎంతో దోహదపడుతోంది.

– బండి చైతన్య, ఈ3 సివిల్, మార్కాపురం, ప్రకాశం జిల్లా

రోజూ 3 గంటల సాధన



మా మేనమామ శిల్పి, పెయింటింగ్స్ వేస్తారు. చిన్నప్పటి నుంచి వాటిని చూస్తూ పెరిగాను. దీంతో ఆర్ట్‌లపై ఆసక్తి పెరిగింది. ట్రిపుల్‌ఐటీలో చేరిన తరువాత పీయూసీ నుంచి రోజుకు మూడు గంటలు నేర్చుకుంటున్నాను. ఇది ఆటోమొబైల్ డిజైనింగ్‌లో కూడా దోహదపడుతుంది.

– బలగా అనూష, ఈ3 మెకానికల్, మార్కొండపుట్టి, గరుగుబిల్లి మండలం, అల్లూరు మన్యం జిల్లా

వెబ్ డిజైనింగ్‌కు ఎంతో ఊతం



ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచి పోస్టర్ కలర్స్ ఆర్ట్‌ను నేర్చుకుంటున్నాను. అంతకు ముందు ఫొటోగ్రఫీని నేర్చుకోవడంతో ఆర్ట్‌పైన ఆసక్తి కలిగింది. దీనిని సాధన చేస్తుండటంతో ఏకాగ్రత పెరుగుతోంది. ఈ ఆర్ట్ వెబ్ డిజైనింగ్‌లో ఎంతో ఉపయోగపడుతుంది.

– గుంటుకు గణేష్, ఈ4 సీఎస్ఈ, పొందూరు, శ్రీకాకుళం జిల్లా

ఖాళీ సమయంలో మెలకువలు నేర్పుతున్నాం



విద్యార్థులకు ప్రతిరోజూ తరగతులు ఉంటాయి. విద్యార్థులు తమకు ఖాళీగా ఉన్న సమయంలో వస్తే వారికి ఆర్ట్‌లో మెలకువలను నేర్పుతాం. ముందు బేసిక్స్, షేడింగ్ టెక్నిక్స్ నేర్పుతాం. పెన్సిల్ ఆర్ట్, కలర్ పెన్సిల్ ఆర్ట్, వాటర్ కలర్ ఆర్ట్, పోస్టర్ కలర్ ఆర్ట్, వర్లీ ఆర్ట్, మండల ఆర్ట్ వంటి ఆరు రకాల ఆర్ట్‌లలో శిక్షణ ఇస్తున్నాం. దీని వల్ల ఏకాగ్రత పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గుతుంది. ఇప్పుడు ఎంతో మంది ఇళ్లలో అలంకరణ కొరకు ఇలాంటి చిత్రాలను పెద్ద మొత్తంలో పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

– పెరుమాలి శివశంకర్, ఇన్‌స్ట్రక్టర్, ట్రిపుల్ ఐటీ, శ్రీకాకుళం

అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్

ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు



ఆచంటలో మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ (ఆచంట): ఎన్ని కష్టాలు ఎదురైనా మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులు మహిళల బ్యాంక్ ఖాతాలకు జమ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల నమ్మకాన్ని చూరగొన్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంటలోని రామేశ్వరస్వామిసత్రంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో పాల్గొని మండలంలోని 1,252 గ్రూపులకు గాను రూ.12,18,85,990 విలువైన చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చంద్రబాబు మాట ఇచ్చి రైతులకు, మహిళలకు మొండి చెయ్యి చూపించారన్నారు. ఏనాడూ చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీని నిలుపుకోలేదన్నది చరిత్రలో ప్రతి ఒక్కరికీ తెలుసు అన్నారు. కానీ, సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి సంక్షేమాన్ని అమలు చేసి మహిళాభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. చంద్రబాబు అప్పులు అంటూ విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతి అప్పు ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగిస్తున్నారన్నారు. అమ్మ ఒడి ద్వారా చిన్నారులపై నేడు పెడుతున్న పెట్టుబడి భవిష్యత్తు తరాల్లో అభివృద్ధి ఫలాలు కనిపిస్తాయన్నారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు అందిస్తూ సామాజిక భద్రత కల్పిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరింత సంక్షేమాన్ని అందించనున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌కు అందరూ అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పెనుమంట్ర ఎంపీపీ కేవీఎస్ నారాయణరెడ్డి (వాసు), పోడూరు జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి, సర్పంచ్‌లు కోట సరోజని, జక్కంశెట్టి శ్రీరాములు, జక్కంశెట్టి చంటి, ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధ, తప్పెట్ల విజయకుమారి, ఉల్లం జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, గణేషుల సుబ్బారావు పాల్గొన్నారు.

బుల్లి అశ్వం మృతి



ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణశాలలో రెండు రోజుల క్రితం జన్మించిన అశ్వం పిల్ల శనివారం మృతి చెందింది. స్వామివారి సేవకు వినియోగించే యోగిని అశ్వం గతనెల 30న ఆడ బుల్లి అశ్వానికి జన్మనిచ్చింది. అయితే మరుసటి రోజు 31న తీవ్ర అస్వస్థతతో తల్లి అశ్వం మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే తల్లిపాలు లేక దిగులుతో పిల్ల అశ్వం సైతం మరణించింది.

బస్సులో బంగారం బ్యాగ్ చోరీ

పెనుగొండ : బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి చెందిన రూ.40 లక్షల విలువైన బంగారం, నగదు ఉన్న బ్యాగు చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరుకు చెందిన బంగారం వ్యాపారి శ్రీపాల్ జైన్ ఆర్డరుపై బంగారు ఆభరణాలు తయారు చేస్తాడు. తన గుమాస్తా బాబూరామ్‌తో కలిసి రాజమహేంద్రవరం వచ్చాడు. మార్చి 28న ఉదయం వ్యాపారి రాజమహేంద్రవరంలోనే ఉండగా, గుమస్తా బాబూరామ్ బంగారం ఉన్న బ్యాగుతో నరసాపురం వెళ్లాడు. అక్కడ రెండు దుకాణాల వద్ద రూ.2 లక్షలు నగదు తీసుకుని, బ్యాగులో ఉన్న 350 గ్రాముల 35 రాళ్ల జుకీలు, 150 గ్రాముల చెవి చుట్టూ ఉండే మ్యాటీలు, 200 గ్రాముల బ్యాక్ చైన్‌లు, 50 గ్రాముల ఫిష్ డాలర్లు, 100 గ్రాముల బేబీ బ్రాస్‌లెట్‌లతో తిరుగు ప్రయాణమయ్యాడు. పాలకొల్లు వెళ్లి అక్కడి నుంచి రాజమహేంద్రవరానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. పెనుగొండలోని సిద్ధాంతం రోడ్డు వద్దకు వచ్చేసరికి బ్యాగు పోయిందని గుర్తించాడు. విషయాన్ని వెంటనే యజమాని శ్రీపాల్ జైన్‌కు తెలియజేయగా.. ఆయన పెనుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో రూ.38 లక్షల విలువైన 850 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు ఉన్నట్లు బంగారం వ్యాపారి శ్రీపాల్ జైన్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు శనివారం విలేకరులకు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా క్షీరారామలింగేశ్వరస్వామి కల్యాణం

తొలిసారిగా స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ



కుంభం పోసిన అనంతరం రథాన్ని లాగుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాసు, తాతాజీ, భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

పాలకొల్లు సెంట్రల్ : పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీపార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ సమేత శ్రీ జనార్దనస్వామివార్ల సాప్తాహ్నిక కల్యాణ మహోత్సవం శనివారం రంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్, బాలా త్రిపుర సుందరి దంపతులు ఈ కల్యాణోత్సవ పూజల్లో పాల్గొనగా, భమిడిపాటి వెంకన్న, సూరిబాబు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు కిష్టప్ప, సునీల్, పూర్ణయ్యలు కల్యాణ తంతును జరిపించారు. యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి అర్చకులు రమణస్వామి శ్రీపార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ సమేత జనార్దనస్వామివార్లకు పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, రవికలు సమర్పించారు. తొలిసారిగా స్వామివార్లకు ఇలా ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు తీసుకురావడంతో భక్తులు పరమానందభరితులయ్యారు. దాతలు కంచర్ల రామారావు, నాని, గౌరీ కుటుంబ సభ్యులు భక్తులకు లడ్డూ ప్రసాదం, గాదె సుబ్బారావు దంపతులు బహుమతులు పంపిణీ చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కనులపండువగా రథోత్సవం

పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణోత్సవం సందర్భంగా శనివారం రథోత్సవం కనులపండువగా జరిగింది. తొలుత జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివార్లకు కుంభం వేసి రథాన్ని లాగి ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం సన్నాయి వాయిద్యాలు, గరగల నృత్యాలు, కేరళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సాలా వెంకటేశ్వరరావు, రెల్లి నరసింహరావు, నాగులకొండ నెహ్రూ, జ్యోతి బాలాజీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, ధర్మ పరిరక్షణా సమితి సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే కొఠారు కృషి



ఎమ్మెల్యేకొఠారుకు కృతజ్ఞతలు చెబుతున్న చిన్నారి భవ్యశ్రీ తల్లి హేమలత

దెందులూరు: నెలల వయస్సున్న చిన్నారి అనారోగ్యాన్ని ఎలా నయం చేయించుకోవాలో తెలియక బాధపడుతున్న ఓ పేద కుటుంబానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అండగా నిలిచారు. కొవ్వలికి చెందిన చిన్నారి భవ్యశ్రీ అన్నవాహికలో ప్రేగు అడ్డుపడి తీవ్ర ఇబ్బందిపడుతుండగా, మరోవైపు గుండెలో రంధ్రం ప్రాణాన్ని పిండేస్తోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో భవ్యశ్రీని కాపాడాలని తల్లి హేమలత కనిపించిన దేవుళ్లందరికీ మొక్కింది. అయినా గండం గట్టెక్కే మార్గం తెలియక కొందరి సూచనలతో తన చిన్నారి భవ్యశ్రీని తీసుకుని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసి సమస్యను కన్నీటిపర్యంతమై తెలిపింది. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సీఎంఓ కార్యాలయం, తిరుపతి టీటీడీ ట్రస్ట్, హృదయాలయ యాజమాన్యంతో మాట్లాడి చిన్నారికి ఆపరేషన్ జరిగేలా శ్రద్ధ తీసుకున్నారు. అనంతరం శస్త్రచికిత్సలకు, వైద్యానికి అయిన ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బిడ్డకు మెరుగైన చికిత్స చేయించలేక ఇబ్బందులు పడుతున్నామంటూ గత నెలలో దెందులూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లింది. ఆమెకు పెద్దన్నలా సీఎం ధైర్యం చెప్పి చిన్నారి భవ్యశ్రీకి వైద్యానికి రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. చిన్నారికి మెరుగైన వైద్య చికిత్స చేయించాలని ఎమ్మెల్యే, అధికారులకు సీఎం సూచించారు. ఇక శస్త్రచికిత్సలకు అయిన రూ.8 లక్షల సొమ్మును సీఎంఆర్ఎఫ్ కింద మంజూరు చేయించి చిన్నారి కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. చిన్నారి వైద్యానికి ఎంతో కృషి చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి తల్లి హేమలత, వైఎస్సార్‌సీపీ కొవ్వలి అధ్యక్షులు కాటి సుధాకర్‌తో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

యాప్ పేరు చెప్పి రూ.3 లక్షల మోసం

జంగారెడ్డిగూడెం: ఒక యాప్ ద్వారా తమ అకౌంట్‌లలో నగదు జమ చేయించుకుని ఒక మహిళను మోసం చేసిన నేరంపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. శ్రీనివాసపురానికి చెందిన కలపాల రత్నకుమారి ఉద్యాన శాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. గత జనవరిలో గుర్తు తెలియని వ్యక్తులు ఫార్చ్యున్ పే సీక్రెట్ వీఐపీ యాప్ అనే కంపెనీ ప్రతినిధులమని చెప్పి రత్నకుమారికి ఒక లింక్ ద్వారా సమాచారం పంపి, ఆమెకు లాటరీలో వస్తువులు తగిలాయని, తమకు నగదు చెల్లిస్తే వస్తువులు ఇస్తామని చెప్పి ఫోన్‌పే ద్వారా తొలి విడతగా రూ.10 వేలు నగదు జమ చేయించుకున్నారు. ఆ తరువాత మళ్లీ ఆన్‌లైన్ ద్వారా సమాచారం కోరితే మరికొంత చెల్లించాలని, మొత్తం సొమ్ము ఒకేసారి తిరిగి ఇస్తామని, అలా విడతల వారీగా రూ.3,09,640 ఫోన్‌పే ద్వారా తీసుకున్నారు. తరువాత యాప్ యాజమాన్యాన్ని కాంటాక్ట్ చేయడానికి బాధితురాలు ప్రయత్నించగా, సదరు కంపెనీ మూసివేశారని సమాచారం ఇచ్చి నగదు విషయం దాటవేశారు. దీంతో తాను మోసపోయానని గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

వడ్డీ రాయితీ వసూలు నిర్ణయంతో రైతులపై భారం

నూజివీడు: రైతుల నుంచి సహకార సంఘాలు 2010 సంవత్సరం నుంచి దీర్ఘకాలిక రుణాలపై 6 శాతం వడ్డీ రాయితీ వసూలు చేయాలన్న డీసీసీబీల నిర్ణయం సహకార సంఘాల మనుగడకు ప్రశ్నార్థకంగా మారుతుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. నూజివీడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకార సంఘాలకు రావాల్సిన దీర్ఘకాలిక రుణాలకు సంబంధించిన 6 శాతం వడ్డీ రాయితీని 2010–11 నుంచి 2012–2013 వరకు రూ.46.72 కోట్లు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని 651 సహకార సంఘాలకు రావాల్సి ఉందన్నారు. అప్పటి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతుల నుంచి వసూలు చేసిన దీర్ఘకాలిక రుణాలపై 6 శాతం వడ్డీ రాయితీ మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని నగదుగా సహకార సంఘాలు వసూలు పర్చటం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం ఏలూరు డీసీసీబీ పరిధిలోని 263 సహకార సంఘాలు రూ.27.52 కోట్లు, కాకినాడ డీసీసీబీ పరిధిలో గల 388 సహకార సంఘాలు రూ.19.20 కోట్లు రైతులు నుంచి వసూలు చేయాలని నిర్ణయించడంతో రైతులపై భారం పడుతుందన్నారు. 11 ఏళ్ల నుంచి మిన్నకుండి ఇప్పుడు చెల్లించాలని ఆదేశాలు ఇవ్వడమేమిటని నీలం ప్రశ్నించారు. ఇది ఎంతమాత్రం సమంజసం కాదన్నారు.



క్లుప్తంగా

మెనూ అమలుపై శ్రద్ధ వహించాలి



బల్లిపాడులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వీవీ రామారావు

అత్తిలి: జగనన్న గోరుముద్దను విద్యార్థులంతా భుజించాలని అత్తిలి ఎంపీడీవో వీవీ రామారావు అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆహార పదార్థాల తయారీ, రుచి, శుచి శుభ్రతల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వైఎస్ఆర్‌సీఎం దత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి



జగన్నాథపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని భవన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయడం లేదన్నారు. సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించారని, వాటిని తిరిగి బోర్డుకు జమ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు తులా దుర్గారావు, మంచాల సత్తిపండు, ఎం.సత్యనారాయణ, పి.సురేష్, సీహెచ్.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు, జి.దుర్గారావు, టి.దుర్గాబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు రీసర్వే పక్కాగా నిర్వహించాలి



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషగిరిరావు

పెంటపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రక్ష, భూ సర్వే కార్యక్రమాన్ని సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో వీఆర్వోలతో జగనన్న భూరక్ష, భూ సర్వేపై ప్రత్యేక రివ్యూ సమావేశం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 రోజుల ఈ ప్రోగ్రాంలో భాగంగా వీఆర్వోల పనితీరుపై గ్రామాల వారిగా సమీక్షించారు. ఈ సర్వే పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. సిబ్బంది పని తీరును మెరుగుపరచుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఫీల్డ్ వర్కు చేసి సర్వే రిపోర్టును తయారు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు రెండు గ్రామాలే పూర్తయ్యాయని మిగతా గ్రామాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వెబ్‌లాండ్, లోపాలు, డ్రోన్ తదితర విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కనకదుర్గ, డీటీలు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువను పరుగెత్తించాలి



పెంటపాడులో డివిజన్ అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువను అధికారులు పరుగెత్తించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా వెటర్నరీ అధికారి (డీఏహెచ్‌వో) కె. మురళీకృష్ణ పేర్కొన్నారు. పెంటపాడు పశుసంవర్ధక శాఖ డీడీ కార్యాలయంలో పెంటపాడు, గూడెం, పోడూరు, పెనుగొండ, అత్తిలి తదితర మండలాల వెటర్నరీ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వేసవిలో పశుసంతతి అభివృద్ధి పొందేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు వీలుగా ప్రభుత్వం చేపట్టిన పాలవెల్లువ ద్వారా పాలు విక్రయించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు, ఏడీలు, పెంటపాడు పశువైద్యాధికారి మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లెలకు ఆరోగ్యరక్ష

- వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్‌ల పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమాల నిర్వహణ



గ్రామాల్లో పేదలకు వైద్యం చేస్తున్న విలేజ హెల్త్ క్లినిక్ టీం సభ్యులు

పెంటపాడు: గ్రామీణుల ఆరోగ్యరక్షణకు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మారుమూల ప్రాంతాల ప్రజలు ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పంచాయతీ స్థాయిలోనే టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలంటూ రాష్ట్రప్రభుత్వం గత నెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆరోగ్యరంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీ) సాధనకు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు విస్తృత సేవలు అందించేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీలతో సరికొత్త విధానానికి రూపకల్పన చేసారు. నియోజకవర్గంలో గూడెం, పెంటపాడు మండలాలలో సచివాలయాలల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఉన్నాయి.

ఆరుగురు సభ్యులతో కమిటీ

ప్రతి గ్రామసచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ అఫీసర్ సీహెచ్‌వో మిడ్‌లెవెల్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌వో) ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, స్కూలు హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

గ్రామీణుల ఆరోగ్యంపై ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు, రక్తహీనత, పోష్టికాహారలోపం ఉన్నవారిని గుర్తించాలి. వారి అనారోగ్య నివారణ చర్యలు, గ్రామీణ ప్రజల జీవన శైలి, రోగాల నివారణ, చికిత్సలపై కమిటీ అప్రమత్తంగా ఉండాలి. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యవివరాలను స్కూల్లోనే హెల్త్ అంబాసిడర్‌లు పర్యవేక్షించాలి. కౌమారదశలోని బాలికలను రోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేయాలి. బరువు తక్కువ ఉన్న పిల్లలకు పోష్టికాహారం అందించాలి. యుక్తవయస్సు బాలికలకు శానిటరీ ప్యాడ్స్ సరఫరా వివరాలు, బరువు తక్కువగా

ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ

ఉన్న పిల్లల మధ్యాహ్న భోజన వివరాలను కమిటీ లీడర్‌లకు అందించాలి. ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా పిల్లలకు ఆరోగ్యపరీక్షలు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, పిల్లల రక్త హీనతపై పర్యవేక్షణ, గర్భిణులకు ప్రసవాలకు ముందు, తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన, మందుల పంపిణీ, ఆరోగ్యసంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు అందేలా సమన్వయం చేసుకోవాలి. గ్రామాల్లో నిర్వహించే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీం లీడర్లు విధిగా హాజరు అయ్యేలా టీంలో ఉన్న డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. గ్రూపు సభ్యుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకోవాలి. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇమ్యూనైజేషన్ ద్వారా రోగ నిరోధకతను పెంచడం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి. బాల్యవివాహాలు నివారించడంతో పాటు, యుక్తవయస్సులో గర్భాన్ని నిరోధించాలి. కుటుంబ నియంత్రణ ప్రణాళికను అమలు చేయాలి. ప్రతీ శుక్రవారం డ్రై డే, పరిశుభ్రతపై చర్య తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సి బాధ్యత పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఉంటుంది.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో ఆరోగ్యపరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తాం. సంపూర్ణ ఆరోగ్య దిశగా పల్లెలను తీర్చిదిద్దుతాం.. ఈ కమిటీల ఏర్పాటు ద్వారా గ్రామీణ ఆరోగ్య సమస్యలను పరిష్కరించవచ్చు. ఆరోగ్యం పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు చర్యలు చేపడతాం.

– డి. దామోదరరావు, ఎంపీడీవో పెంటపాడు మండలం

ప్రజలకు ఎంతో ఉపయోగం



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఆరోగ్యంతో పాటు , వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్‌ఎటాక్, కాన్సర్ తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విలేజి హెల్త్ క్లినిక్‌లు ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తాం.

– డాక్టర్ ఎస్వీ రమణ, ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత



కె ఇల్లిందలపర్రులో విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేస్తున్న నాయకులు

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందలపర్రు గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రిని గ్రామ సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నా విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ఎన్నో సదుపాయాలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలు రాయనున్న 150మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్స్, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిపాటి సతీష్, మండల ఎస్సీ సెల్ నాయకులు గోగి బాబి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలకు ఉచిత బస్సు సౌకర్యం

తణుకు అర్బన్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తణకు ఆర్టీసీ డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యం ఉపకరిస్తుందన్నారు. విద్యార్థులందరూ ఈ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

భైరాగిమఠంలో ఘనంగా తెప్పోత్సవం



భైరాగిమఠంలో హంసవాహనంపై విహరిస్తున్న సీతారాములు



తెప్పోత్సవంలో సీతారాములు

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు భైరాగిమఠంలో జరుగుతున్న సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాత్రి 8గంటల నుంచి 10 గంటల వరకు స్వామివారి తెప్పోత్సవం పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంతో పాటు, చుట్టు పక్కల గ్రామాలు బాణసంచా వెలుగులు, టపాసుల శబ్దాలతో మారుమ్రోగింది. ఉదయం 6 గంటల నుంచి ఏకాదశి పురస్కరించుకొని నిత్యార్చనలు, తులసీదళ సహస్రనామార్చనలు, విశేషపూజలు, నిత్యహోమం, బలిహరణ, తదతర పూజలు చేశారు. రాత్రి 11 గంటలకు స్వామివార్లను పొన్నవాహనంపై ఊరేగించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు తిలోచన దాస్, పూర్ణ చంద్ర త్రిపాఠి, రామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం స్వామివారికి శ్రీ చక్ర స్నానం వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో సాయి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి లబ్ధిదారుడికీ జాబ్ కార్డు అందించాలి



గృహ నిర్మాణాల ప్రగతిపై మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్ధిదారునికి జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబ్ కార్డును అందించాలని మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు సిబ్బంది ఆదేశించారు. శనివారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండలంలో గృహ నిర్మాణాల ప్రగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు మండలంలో 1,366 మంది గృహాలు నిర్మించుకోగా వారిలో 1,045 మందికి జాబ్ కార్డులు తయారు చేసినట్లు తెలిపారు. మండలంలో వేల్పూరులో 131 మందికి దువ్వలో 144 మందికి, తేతలిలో 129 మందికి, మండపాకలో 18 మందికి ఇంకా జాబ్ కార్డులు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి ఎంజీఎన్ఆర్‌జీఈఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు గైర్హాజరు కావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, క్లస్టర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలపై నిర్లక్ష్యం



పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ రంగ సంస్థలపై నిర్లక్ష్యం విడనాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ కేంద్రాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పోరాటం 700 రోజులకు చేరుకున్న సందర్భంగా శనివారం పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద అనుబంధ కార్మిక సంఘాల కార్యకర్తలచే భారీ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించని పక్షంలో ప్రజా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల త్యాగాలతో, పోరాటాలతో ముడిపడిన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రం ప్రైవేట్ పరం చేయాలని చూడటం సరికాదని, ఏపీ ప్రజల మనోభావాలను, ప్రయోజనాలను దెబ్బతీయడమే అవుతుందన్నారు. నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తూ ఉత్పాదకతలో ఉన్నత ప్రమాణాలు సాధిస్తున్న విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు, మునిసిపల్, ఆర్టీసీ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై విచారణకు విజయవాడకు పోలీసులు

ఉండి: భీమవరానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి అభిరామ్ ఇటీవల మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా విజయవాడకు ప్రత్యేక బృందాన్ని పంపించినట్లు పోలీసులు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగించుకుని మార్చి 28న విజయవాడ నుంచి రైల్లో వస్తున్న విద్యార్థి అభిరామ్ ఉండి మండలం కలసిపూడి పంట కాలువలో శవమై తేలడంతో తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందంటూ అతడి తండ్రి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడలో రైలు ఎక్కక ముందు ఏం జరిగిందనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి కారుమూరిని కలిసిన ముస్లిం సోదరులు



తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన మైనారిటీ నాయకులు

తణుకు అర్బన్: ముస్లిం సోదర, సోదరీమణులందరికీ రంజాన్ మాసం శుభాకాంక్షలు చెబుతున్నానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా తణుకు నియోజకవర్గంలోని ముస్లిం నాయకులు శనివారం మంత్రి కారుమూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకులోని 5 మసీదుల్లోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, అత్తిలి కోఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, షేక్ బాజీ, రొలాక్స్ షేక్ సలీం, షేక్ సలీం, అబ్దుల్ అన్సారీ పాల్గొన్నారు.

దళిత వాడల అభివృద్ధికి కృషి చేయాలి



కంతేరు గ్రామంలో నూతనంగా ఎన్నికైన కమిటీ

ఇరగవరం: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు ప్రభుత్వం నిధులు విడుదల చేసి దళిత వాడలు అభివృద్ధి చేయాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కంతేరు గ్రామంలో శనివారం మాల మహనాడు గ్రామ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ముందుగా బాబా సాహెబ్ డా. బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వాడల్లో ఉన్నా కమ్యూనిటీ హాల్స్‌ను అభివృద్ధి చేయాలన్నారు. అంబేడ్కర్ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సరెళ్ల ప్రవీణ్, గ్రామ అధ్యక్షుడు మేడిది నాని, యూత్ అధ్యక్షుడు మేడపాటి రమేష్ ,ప్రధాన కార్యదర్శి ఈద బాలు, అరిగెల పుల్లారావు, సబ్బితి భాను వర ప్రసాద్, కోటి సురేష్, పులిదిండి చిట్టి బాబు, ఈదా సతీష్, కోటూరి ప్రశాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

రుణ మాఫీ మహిళలకు వరం

ఆకివీడు: డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ ఒక వరమని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మూడో విడత రుణమాఫీ చేసి మహిళలకు ఆసరాగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మహిళా పక్షపాతిగా రాష్ట్రంలో సీఎం పాలన ఉందన్నారు. మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో అనేక పథకాలు అమలుజేస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి పథకం ద్వారా పేద పిల్లల్ని చదివించుకునే అవాకశం ఏర్పడిందన్నారు.కాపు మహిళలకు, ఇతర మహిళలకు చేయూత పథకం ద్వారా ఆర్థికంగా చేయూతనిస్తూ వారి కుంటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేదుకు సీఎం జగన్ పథకాలు తోడ్పడుతున్నాయని చెప్పారు.

ధాన్యం సేకరణ సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషగిరిరావు

పెంటపాడు: దాళ్వా మాసూళ్లు ప్రారంభం దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు ధాన్యం సేకరణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జీ.వీ శేషగిరిరావు పేర్కొన్నారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం మండల వ్యవసాయశాఖ సిబ్బంది, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వీఏఏలు, రైతు భరోసా కేంద్రాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో ఉన్న లోపాలను అధిగమించి ఈ సారి ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తేమశాతం యంత్రాలు, సంచులు, ఈ క్రాఫ్ తదితర విషయాలలో శ్రద్ధ కనపరచాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి, రాచర్ల సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్బన్న, ఆర్ఐ కనకదుర్గ, రెవిన్యూ సిబ్బంది వీఏఏలు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి



లక్ష్మీనారాయణ స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో ఏకాదశి పురస్కరించుకొని శనివారం లక్ష్మీనారాయణ స్వామికి ఉదయం విఘ్నేశ్వర పూజ, మూల విరాట్‌కు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో అభిషేకాలు జరిగాయి. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. పూజలను ఆర్యవైశ్య సంఘం సభ్యులు నున్న బాలా త్రిపుర సుందర రావు, శ్యాం, తదితరులు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామాలయం వద్ద అన్నసమారాధన

శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక సుబ్బారావుపేటలోని శ్రీనివాస రామాలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు ఎనిమిది వేల మందికి పైగా భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాలను చైర్మన్ శానం రామకృష్ణ, కొప్పిశెట్టి రమణయ్య, ఆచార్యులు, ఓసూరి వీర్రాజు, అనిల్ కుమార్, మురళీ కృష్ణలు పర్యవేక్షించారు.

శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో....

పట్టణంలోని రామచంద్రరావుపేటలో ఏకాదశి సందర్భంగా కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శనివారం రోజున శ్రీ కృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు, సామూహిక పారాయణంలు చేశారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

సాక్షి, భీమవరం: బాలికపై అత్యాచారయత్నం కేసులో పట్టణానికి చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో ఓ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలిక తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన కె.వెంకట దుర్గాదివాకర్ అనే 49 ఏళ్ల వ్యక్తి బాలికపై అత్యాచారానికి ప్రయత్నించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయగా స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదన గోపాలస్వామి రథోత్సవం

పెనుగొండ: ఆచంటలో రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరు పెద్దిరాజు, ఎంపీపీ కేఎస్ నారాయణ రెడ్డి(వాసు) పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ విచారణ

పాలకోడేరు: పెన్నాడలోని ఒక ఇంటి స్థలం పన్ను విషయంలో కేంద్ర న్యాయ శాఖ మంత్రికి అందిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో పంచాయతీ విస్తరణ అధికారి వీ. రెడ్డియ్య శనివారం విచారణ చేశారు. గ్రామానికి చెందిన చీరా వెంకట సత్యనారాయణ, భార్య వెంకలక్ష్మి కొంత కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. అందుడైన వెంకట సత్యనారాయణ పేరిట ఉన్న ఇంటి పన్నును 2021 భార్య వెంకటలక్ష్మి తన పేరిట మార్పు చేయించుకున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించి రికార్డు చేసిన వివరాల ప్రతులను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

కోడిపందేలపై దాడి

పాలకోడేరు: కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గరగపర్రు శివారులో శనివారం కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి రూ.2,100 నగదు, కోడి, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు